సాక్షి మంచిర్యాల

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



పనులు పూర్తయ్యేనా..?
చెన్నూర్ నియోజకవర్గానికి మునుపెన్నడూ లేని విధంగా నిధులు వరదలా వస్తున్నాయి. అయిన ప్పటికీ పనులు అసంపూర్తిగా ఉండడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 10లో ▸



హోంగార్డుల సేవకు దక్కని గౌరవం
శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా పని చేస్తున్న హోంగార్డులకు సరైన గౌరవం దక్కడం లేదు. సీఎం ఇచ్చిన హామీలు అమలు కాక ఆందోళన చెందుతున్నారు. 10లో ▸

గరిష్టం/కనిష్టం
29.0 /25.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

కృత్రిమ అవయవాలు పంపిణీ



బాలుడితో డీఈవో, సెక్టోరల్ అధికారి

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా సైన్స్ కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్యాశాఖ పర్యవేక్షణలో కృత్రిమ అవయవాలు(ఆర్టిఫిషియల్ లింబ్) శుక్రవారం పంపిణీ చేశారు. 0–18ఏళ్లలోపు వివిధ లోపాలతో బాధపడుతున్న వారి కోసం జిల్లాల వారీగా గత ఏడాది శిబిరాలు ఏర్పాటు చేసిన వైద్య పరీక్షలు నిర్వహించారు. అర్హులైన 191మందికి 291 ఉపకరణాలు అందించనున్నారు. మొదటి దఫాలో తొమ్మిది మందికి కృత్రిమ అవయవాలు(కృత్రిమ కాళ్లు) అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో యాదయ్య మాట్లాడుతూ దివ్యాంగులైన చిన్నారులు, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపునకు అలింకో చేపట్టిన ఉచిత ఉపకరణాల అందజేతతో మరింత చేయూత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, అలింకో ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ పట్వర్ధన్

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కాళోజీ జయంతి వేడుకలను పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణ భాషకు కాళోజీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పట్వర్ధన్, కవి, రచయిత శ్రీనివాస్, అధ్యాపక బృందం రామకృష్ణ, కిషోర్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ సంతోష్, ప్రేమలత, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం
దండేపల్లి: మండలంలోని ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పద్య, పాటల పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం జయప్రద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎస్ఎంసీ ఎన్నికకు సమాయత్త సమావేశం



సమావేశంలో హెచ్ఆర్‌డీఏ టీం సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు చెందిన పలువురు సీనియర్ వైద్యులు, సీనియర్ ప్రాక్టీషనర్లు టీఎస్ఎంసీ ఎన్నికల కోసం హెచ్ఆర్‌డీఏ టీం సభ్యుల సమావేశం శుక్రవారం మంచిర్యాలలో నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేసే హెచ్ఆర్‌డీఏ టీం సభ్యులు 13 మందిని ప్యానెల్‌కు పరిచయం చేసిన అనంతరం హెచ్ఆర్‌డీఏ ప్రెసిడెంట్ డాక్టర్ మహేశ్‌కుమార్ టీఎస్ఎంసీ ఎన్నికల వివరాలు వెల్లడించారు. వైద్యరంగం కోసం హెచ్ఆర్‌డీఏ చేస్తున్న కృషిని వివరించారు. 17 ఏళ్లుగా టీఎస్ఎంసీలో ఎన్నికలు జరగకపోవడంతో సుప్రీంకోర్టులో హెచ్ఆర్‌డీఏ పోరాడిందని తెలిపారు. డాక్టర్ గుండగాని శ్రీనివాస్, మంచిర్యాల యూని ట్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాస్ యెగ్గన, డాక్టర్ అనిల్, డాక్టర్ సంతోష్, డాక్టర్ వంశీ పాల్గొన్నారు.


పరిశోధన ప్రాజెక్టులకు వేదిక ప్రయాస్

మంచిర్యాలఅర్బన్: ఔత్సాహిక విద్యార్థులు, యువతలో పరిశోధన వైఖరిని ప్రోత్సహించడానికి ఎస్సీఈఆర్టీ 2023–24 కార్యక్రమంలో భాగంగా ప్రయాస్ నిర్వహిస్తోందని డీఈవో యాదయ్య తెలిపారు. దరఖాస్తులకు సెప్టెంబర్ 20వరకు తుది గడువు ఉందని, ఎంపికైన ప్రాజెక్టులకు రూ.50వేలు ప్రోత్సాహకం ఉంటుందని, విద్యార్థులు పాల్గొనేలా చొరవ చూపాలని తెలిపారు. స్థానిక సమస్యను గుర్తించి అధ్యయనం చేయడం, సమస్య వెనుక శాస్త్రీయ కారణాన్ని పరిశోధించడం, శాస్త్రీయ పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నం చేయడం వంటి అంశాలపై ప్రాజెక్టు ప్రతిపాదనలను ఆహ్వానిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు 9నుంచి 12వ తరగతి వరకు చదువుతూ 14నుంచి 18ఏళ్లు కలిగి ఉండాలని తెలిపారు. వివరాలకు www.scert.telangana.gov.in సందర్శించాలని తెలిపారు. ప్రయాస్‌పై ఎస్సీఈఆర్టీ హైదరాబాద్ ఆధ్వర్యంలో టీసాట్ ద్వారా టీచర్లు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బీఆర్ఎస్‌లో లీడర్ల కలవరం!

- మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అసంతృప్తి
- అధికార పార్టీ నాయకులపై ప్రతిపక్షాల ఫోకస్
- 'నల్లాల', 'పురాణం', అరవింద్‌రెడ్డికి ఆహ్వానాలు
- ఎన్నికలకు ముందే ఎమ్మెల్యేలకు ఇబ్బందులు






మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు



మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్



మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార బీఆర్ఎస్ పార్టీలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల తీరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కలవరం పుట్టిస్తోంది. పార్టీలో ఆశించిన పదవులు, టికెట్లు దక్కని నాయకుల అసంతృప్తి ఆందోళనకు గురి చేస్తోంది. ఇదే అదునుగా ప్రతిపక్ష పార్టీలు వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎన్నికలకు ముందే సొంత పార్టీ నాయకులతోనే ఎమ్మెల్యేలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఇప్పటికే చాపకింద నీరులా ఉన్న అసంతృప్తి రేపోమాపో బయటపడే అవకాశాలు ఉన్నాయి. దండేపల్లి, హాజీపూర్, మందమర్రి, రామకృష్ణాపూర్‌లోని కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడారు. సమయం, సందర్భం, తగిన హామీ లభిస్తే మరికొందరు ఓ నిర్ణయం తీసుకునేలా ఉన్నారు. జిల్లాలో రాజకీయ పరిస్థితిపై ఇంటెలిజెన్స్ వర్గాలు సమాచారం సేకరించాయి.

ఓదెలు ఎటు వైపు?
మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు తీరు రాజకీయంగా చర్చకు తెరతీసింది. చెన్నూరు నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన రాజకీయ భవిష్యత్‌కు బాల్క సుమన్ రాకతో అనుకోని విధంగా అడ్డుకట్ట పడింది. పెద్దపల్లి ఎంపీగా ఉన్న సుమన్‌కు 2018 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కింది. అప్పటి నుంచి ఓదెలుకు రాజకీయంగా ఇబ్బందిగా మారింది. 2019లో ఓదెలు సతీమణి భాగ్యలక్ష్మిని కోటపల్లి నుంచి జెడ్పీటీసీగా పోటీ చేయించి జెడ్పీ చైర్‌పర్సన్ పదవి ఇచ్చారు. తమను సుమన్ ఇబ్బంది పెడుతున్నారంటూ గతేడాది మేలో బీఆర్ఎస్ పార్టీని వీడి కుటుంబంతో సహా ఢిల్లీకి వెళ్లి అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అయితే మళ్లీ అక్టోబర్‌లోనే తిరిగి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో ఉన్నప్పటికీ తమకు ఆశించిన ప్రాధాన్యత లేకపోవడంతో ఒకింత అసంతృప్తితోనే ఉన్నారు. తాజాగా మరోసారి పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం మొదలైంది. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే సుమన్ మాజీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి రావడం బుజ్జగించేందుకేనని పార్టీలో చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో 'నల్లాల' మళ్లీ పార్టీ మారే ధైర్యం చేస్తారా? బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారా? అనేది కొద్ది రోజుల్లోనే తేలనుంది. 'ఇంకా టైం ఉంది. గతంలో మాదిరి పొరబాటు జరగకుండా అన్నీ ఆలోచించుకుని సరైన నిర్ణయం తీసుకుంటా'నని తమ అనుచరులతో చెబుతున్నట్లు తెలుస్తోంది.

'బీసీ'కి మద్దతిస్తానన్న అరవింద్‌రెడ్డి
మంచిర్యాల అభ్యర్థిని మార్చకపోతే బీసీ నాయకుడిని నిలబెట్టి మద్దతిస్తానని మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ వంటి పదవులు దక్కపోగా, తమకు ప్రాధాన్యత కూడా లేకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయన మంచిర్యాల నియోజకవర్గంలో, పార్టీలోనూ ప్రభావితం చేయగల నేతల్లో ఒకరు. గత ఎన్నికల్లోనూ ఆయన మద్దతు గెలుపోటములపై ప్రభావం ఉంది. తాజాగా వచ్చే ఎన్నికల్లోనూ ఆయన ఎటువైపు మద్దతిస్తారనేది కీలకంగా మారింది.

బయటపడని 'పురాణం'
మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ సైతం లోలోపల అసంతృప్తితో ఉన్నప్పటికీ ఇంకా బయటపడడం లేదు. తెలంగాణ ఆవిర్భావం ముందు నుంచే తూర్పు జిల్లాలో క్రియాశీలకంగా పని చేసిన ఆయన, ఒక దశలో అభ్యర్థులకు టికెట్ల కేటాయింపులో కీలకంగా వ్యవహరించారు. తాజాగా ఆయనకే పార్టీలో ప్రాధాన్యత లేకపోవడంపై ఒకింత నారాజ్ అవుతున్నారు. వచ్చే ఎన్నికల వరకు పార్టీలోనే ఉంటారా? లేక మారుతారా? అనేది ఆసక్తిగా మారింది. ఇక రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుస్కూరి రామ్మోహన్‌రావు మంచిర్యాల టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆయన వర్గం ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరింది. ఆయన పార్టీ వీడే ఆలోచనలో లేనప్పటికీ అనుయాయులు స్థానిక ఎమ్మెల్యే గెలుపు కోసం పని చేస్తారా? అంటే చెప్పలేని పరిస్థితి ఉంది. ఇక ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు మరోసారి టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌లో చేరేందుకు దాదాపు సిద్ధమయ్యారు. తన ప్రత్యర్థి ఓటమే లక్ష్యంగా పని చేస్తానని ఆమె ప్రకటించారు.

ఒకే దఫా ఏరియర్స్‌కు కృషి

- టీబీజీకేఎస్ జనరల్ సెక్రెటరీ మిరియాల రాజిరెడ్డి




మాట్లాడుతున్న మిరియాల రాజిరెడ్డి

నస్పూర్: సింగరేణి కార్మికులకు రావాల్సిన 11వ వేజ్ బోర్డు 23 నెలల ఏరియర్స్ ఒకే దఫా ఇప్పించడానికి కృషి చేస్తున్నామని టీబీజీకేఎస్ జనరల్ సెక్రెటరీ మిరియాల రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్కే 6 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవితను కలిసి ఏరియర్స్ ఒకే దఫాలో ఇప్పించడానికి కృషి చేస్తామని తెలిపారు. సింగరేణి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇప్పించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించామని, 5 వేలమందికి ఎక్స్‌టర్నల్ ద్వారా ఉద్యోగాలు ఇప్పించామని తెలిపారు. ఉద్యోగుల తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. కోల్ ఇండియాలో లేని అనేక హక్కులను సాధించామని తెలిపారు. 190 అండ్ 240 మస్టర్లు నిండిన బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్లుగా ప్రమోషన్లు ఇప్పిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, జీఎం చర్చల ప్రతినిధి వెంగల కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, బ్రాంచి సెక్రెటరీలు పానుగంటి సత్తయ్య, గడ్డం మహిపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, జగదీశ్వర్‌రెడ్డి, ఇప్ప భూమయ్య, రమేశ్, నీలం సదయ్య, వెంకటరాజం పాల్గొన్నారు.

నిరుద్యోగుల్లో నిరాశ

- ఎట్టకేలకు టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల
- ఖాళీలు ఎక్కువ.. ప్రకటించింది తక్కువ
- ఉపాధ్యాయుల పదోన్నతుల తర్వాత పెరుగనున్న ఖాళీలు



మంచిర్యాలఅర్బన్: ఎన్నో ఏళ్ల తర్వాత వెలువడిన టీఆర్టీ ప్రకటన నిరుద్యోగులను నిరాశకు గురిచేస్తోంది. జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు, వెల్లడించిన పోస్టులకు భారీగా వ్యత్యాసం కనిపిస్తోంది. ఓ వైపు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుండగా హడావుడి ప్రకటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్ఏ, ఎస్జీటీల పదోన్నతుల తర్వాత జిల్లాలో మరింతగా ఖాళీలు పెరిగే అవకాశాలు లేకపోలేదు. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన జాబితా ప్రకారం చూస్తే పదోన్నతుల తర్వాత సుమారు 200 ఎస్జీటీ పోస్టులు ఖాళీ ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పోస్టులన్నీ ఎలా భర్తీ చేస్తారో తెలియకుండా పోతోంది. పదోన్నతుల ప్రక్రియ ముగియగానే ఖాళీలపై స్పష్టత వచ్చిన తర్వాత నోటిఫికేషన్ ఇస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నెలల తరబడి శిక్షణ
ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సర్కారు మెగా టీఆర్టీ ప్రకటిస్తుందని వేలాది మంది నిరుద్యోగులు ఆశతో ఎదురుచూశారు. అందుకు భిన్నంగా పదుల సంఖ్యలోనే సబ్జెక్టుల వారీగా పోస్టులకు నియామకాలు చేపడుతామని వెల్లడించడంపై అసంతృప్తికి గురిచేస్తోంది. 2013 నుంచి ఇప్పటివరకు డీఎస్సీ నియామకాలు లేకపోవడం.. ఏళ్ల తరబడి నిరుద్యోగులను నిరుత్సాహానికి గురిచేసింది. పదేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ ఉద్యోగ వయస్సుకు దగ్గరకు వచ్చిన అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తాజాగా వెలువరించిన నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు నిర్దేశిత వయస్సు దాటిపోవడంతో సడలింపు ఇచ్చిన వందలాది మందికి అవకాశాలు లేకుండా పోతోంది. జిల్లాలో సోషల్, బయోసైన్స్ పోస్టులు కాస్త ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. పదిలోపే పోస్టులు ఖాళీగా ఉండే అవకాశాలున్నాయి. దీంతో ఏళ్ల తరబడి ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఆశనిపాతంలా మారింది. ఇంటికి దూరంగా ఉండి కోచింగ్ తీసుకుంటూ నెలలు తరబడి చదువుతున్న వారిలో నిరుత్సాహాన్ని నింపింది. జిల్లాలో ఖాళీల కంటే పోస్టులు తక్కువ చూపడంతో డీఎస్సీ ప్రకటన వచ్చిందనే సంతోషం లేకుండా పోతోందని వాపోతున్నారు. పదోన్నతులు, బదిలీల తర్వాత జీవోను సవరించి ఉపాధ్యాయ ఖాళీలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీలపై గందరగోళం..
జిల్లా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో మొత్తం 473 ఖాళీలు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచరు పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 113 పోస్టులను మాత్రమే ఖాళీగా చూపడంపై నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇంకోవైపు సెప్టెంబర్ 20 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ మొదలవుతుంది. అక్టోబర్ 21 వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. నవంబర్ 20 నుంచి 30వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. ఇంకోవైపు ఖాళీలపైనే గందరగోళం నెలకొంది. పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన ప్రకారం జిల్లాలో 113 ఖాళీలు చూపారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 36, భాషా పండితులు 16, వ్యాయామ ఉపాధ్యాయులు–3, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 58 పోస్టులు ఖాళీగా పేర్కొన్నారు. ఉపాధ్యాయ పదోన్నతుల తర్వాత మిగిలిపోయే పోస్టులను ఏ విధంగా భర్తీ చేస్తారో అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మంచిర్యాలలో ఓటుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్

- జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్
- ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలు

మంచిర్యాలటౌన్: జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో ఓటరు నమోదు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును తెలియజేసేందుకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మృతులు, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్న వారి వివరాలు అందించి ఆయా ఓట్లు తొలగించేందుకు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, తహసీల్దార్ భోజన్న, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ గడియారం శ్రీహరి, బీఎల్‌వో సూపర్‌వైజర్లు, ఆర్పీలు, వార్డు ఆఫీసర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


నస్పూర్‌లో..
నస్పూర్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ తెలిపారు. శుక్రవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా నస్పూర్‌లోని 22వ వార్డు రాయల్ గార్డెన్ నుంచి నస్పూర్ షిర్కే సెంటర్ వరకు ఓటు నా జన్మహక్కు–ఓటు నా భవిష్యత్ అని నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కమిషనర్ రమేశ్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేటలో...
కాసిపేట: యువతీ, యువకులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ కోరారు. శుక్రవారం మండలంలోని వరిపేటలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. గ్రామంలో నూతనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని, గతంలో ఐదారు కిలోమీటర్లు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకునే వారని, ప్రస్తుతం గ్రామంలో ఏర్పాటు చేసినందున వందశాతం ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఎం ఏ.అలీం, ఎంపీవో నాగరాజు, సర్పంచ్ ఆర్.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ పాల్గొన్నారు.

తపాలాశాఖలో ఎక్స్‌ప్రెస్ కార్గో సేవలు

పాతమంచిర్యాల: తపాలాశాఖ ఎక్స్‌ప్రెస్ కార్గో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. భారతీయ రైల్వే, భారత తపాలా శాఖల సమన్వయంతో తక్కువ ఖర్చుతో స్వల్ప వ్యవధిలో వస్తువులు, సరుకులు, పండ్లు, కూరగాయలు, ఇతర సామగ్రిని వివిధ ప్రాంతాల నుంచి రవాణా చేసి వినియోగదారులకు అందించడానికి నిర్ణయం తీసుకుంది. 30కిలోల బరువు ఉన్న వస్తువు నుంచి టన్నుల బరువు ఉన్న సామగ్రిని చేరవేస్తుంది. తపాలాశాఖ ద్వారా బుక్ చేసిన వస్తువులను రైలుమార్గం ద్వారా రవాణా చేసి వినియోగదారుల చిరునామాకు పంపించే విధంగా ఏర్పాట్లు చేసింది. సరుకు రవాణా బుక్ చేసిన ప్రాంతం నుంచి ఎక్కడికి వెళ్లింది.. ఎప్పుడు చేరుతుంది.. ఏ ప్రాంతంలో ఉంది అనే విషయాన్ని ఆన్‌లైన్ ట్రాకింగ్ ద్వారా తెలుసుకునే ఏర్పాట్లు చేశారు. రవాణా సమయంలో వస్తువులు పాడైతే పరిహారం పొందే అవకాశం ఉంది. బుకింగ్ సమయంలో వస్తువు విలువ ఆధారంగా బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. రైతులు, వ్యాపారులు సీజన్‌లో లభించే పండ్లు, కూరగాయలు, ధాన్యం తదితరాలు రవాణా కోసం రైల్వే వ్యాగన్ల ద్వారా దూరప్రాంతాలకు తరలించే ఏర్పాటు ఉంది. సామగ్రిని సురక్షితంగా తరలించడానికి తపాలాశాఖ నెట్‌వర్క్ పూర్తి బాధ్యత తీసుకుని వినియోగదారుల చిరునామాకు చేరవేస్తుందని జిల్లా తపాలాశాఖ అధికారి ఆర్.రామారావు తెలిపారు. ఆదిలాబాద్, మంచిర్యాల పోస్టాఫీస్‌ల్లో ప్యాకింగ్ రవాణా సౌకర్యం ఉందని, దేశంలోని ఏ ప్రాంతానికైనా సరకు రవాణా కోసం తపాలాశాఖ సిద్ధంగా ఉందని వివరించారు.

'ఎల్లంపల్లి'కి భారీగా వరద నీరు



గోదావరిలో కలుస్తున్న నీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్, ఎగువ ప్రాంతాల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు చేరుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి 64 వేల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 86 వేల క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. 1.50 లక్షల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రాజెక్ట్‌లోని 62 గేట్లలో 13 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో గోదావరిలోకి వదులుతున్నారు. శుక్రవారం రాత్రి వరకు ప్రాజెక్ట్ నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను 18.650 టీఎంసీల సామర్థ్యంతో ఉంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 311 క్యూసెక్కులు వదులుతున్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన



వంటావార్పులో సమగ్రశిక్ష ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగులు మంచిర్యాల ఐబీ చౌరస్తాలో వంటావార్పు, బతుకమ్మ ఆటలతో నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పొగుడుతూ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని భజన చేశారు. కేసీఆర్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలు చల్లుతూ పాటలు పాడారు. అంతకుముందు రిలేనిరహారదీక్షల శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు సురేఖ, ఆప్ పార్టీ ప్రధాన కార్యదర్శి నయిం పాషా సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు భారతీదేవి, ప్రధాన కార్యదర్శి రాజన్న, కోశాధికారి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిరసన
పాతమంచిర్యాల: ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే డిమాండ్‌తో జిల్లాలోని నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న ఆల్ క్యాడర్ ఉద్యోగులు మంచిర్యాలలో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరింది. ఉద్యోగులు నిరసన దీక్ష శిబిరం వద్ద ఒంటికాలిపై నిల్చుని నిరసన తెలిపారు. ఉద్యోగుల సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మద్దతు ప్రకటించారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనబోయిన బాపు, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు, డీఈవో లు, పబ్లిక్‌హెల్త్ మేనేజర్‌లు, ఫార్మాసిస్టులు, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సపోర్టింగ్ స్టాఫ్, కాంటింజెంట్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.



ఏమైనా ఉందా..

ఇక్కడే ఉండిపోవచ్చు..

జన్నారం: చిటచిట చినుకులు మొదలవుతున్నాయి. బయట చలిగా ఉంది. గూడు కావాలనుకుంది. మోడువారిన చెట్టుపై అటవీ అధికారులు కృత్రిమంగా గూడు తయారు చేసి ఉంచారు. దానిపై వాలింది. చుట్టూ పరిశీలించి గూడులో దూరి హమ్మయ్య అనుకుంది పక్షి. జన్నారం అటవీ డివిజన్‌లోని మైసమ్మ కుంటలో లెస్సర్ విస్లింగ్ డక్ శుక్రవారం ఇలా గూడ కోసం వెదుకుతూ దూరుతుండగా ఎఫ్‌డీవో మాధవరావు కెమెరాలో బంధించారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి: పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య కోరారు. శుక్రవారం బెల్లంపల్లి రూరల్‌సర్కిల్ కార్యాలయంలో మిలాద్–ఉల్–నబీ ర్యాలీ, గణేష్ నిమజ్జనం పర్వదినాలపై అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఈసారి మిలాద్–ఉల్–నబీ, వినాయక నిమజ్జనం ఈ నెల 28న వస్తున్నాయని తెలిపారు. ఈ నెల 19న వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతుండగా 28న నిమజ్జనం ఉంటుందని తెలిపారు. సరిగ్గా అదే రోజు మిలాద్–ఉల్–నబీ పండుగను పురస్కరించుకుని ముస్లింలు ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఒకే రోజు రెండు కార్యక్రమాలు ఉండడంతో శాంతిభద్రతలకు భంగం కలుగకుండా వ్యవహరించాలని సూచించారు. ఒకరికొకరు గౌరవించుకుంటూ ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలని కోరారు. కాగా ర్యాలీ నిర్వహించబోమని ముస్లిం మతపెద్దలు అంగీకరించడం శుభపరిణామని అన్నారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్ఓ టి.శంకరయ్య, హిందు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అతిథి లెక్చరర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లాలోని మహాత్మజ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల కళాశాల్లో అతిథి లెక్చరర్లుగా తాత్కాలిక పద్ధతిలో నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల కళాశాలల్లో ఫిజిక్స్ బోధనకు జనరల్-1, మహిళలు-2, జువాలజీ బోధనకు మహిళలు-2 పోస్టుల్లో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 11వ తేదీన సోమవారం హాజీపూర్ మండలం గుడిపేటలోని జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ), బీఈడీ పూర్తి చేసి ఉండాలని, అతిథి లెక్చరర్‌గా ఎంపిక డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 99489 89949, 79934 56620 నెంబర్లలో సంప్రదించాలని అన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ గోపిచంద్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంవీటీసీలో ఖాళీలను భర్తీచేయాలి

మందమర్రిరూరల్: సింగరేణిలోని ఎంవీటీసీలో ఖాళీ పోస్టులను వెంటనే సీనియర్ స్టాఫ్‌తో భర్తీ చేయాలని సీఐటీయూ మందమర్రి ఏరియా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏరియాలోని కేకే-5 గనిపై నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం గని మేనేజర్ భూశంకరయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ఎంవీటీసీలో ఏర్పడిన ఖాళీలను యాజమాన్యం సీనియర్‌లతో భర్తీ చేయకుండా ఉద్యోగ విరమణ పొందిన మైనింగ్, టెక్నికల్ ఉద్యోగులతో భర్తీ చేస్తుందని ఆరోపించారు. సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న సీనియర్‌లకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు రాజేందర్, శ్రీనివాస్, భరత్, చైతన్యరెడ్డి, శివ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని మృతదేహం

లక్సెట్టిపేట: మండలంలోని సూరారం గ్రామం స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల వైపునకు వెళ్తున్న ఒమిని వాహనం సూరారం గ్రామ స్టేజీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్న సమయంలో ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పనులు పూర్తయ్యేనా..?

- చెన్నూర్‌కు మునుపెన్నడూలేని నిధుల వరద
- మున్సిపాలిటీలకు సైతం ఆశించిన విధంగా నిధులు..
- సెగ్మెంట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దటమే ఇక తరువాయి
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ప్రజల్లో కొంత అసంతృప్తి
- పార్టీ వర్గాల్లోనూ అభివృద్ధి పనులపై సాగుతున్న చర్చ
- పనులు వేగవంతం చేయకుంటే కొంత గడ్డుపరిస్థితే..?


నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్


అభివృద్ధికి నోచుకోని రాజీవ్‌చౌక్ జంక్షన్

రామకృష్ణాపూర్: 'చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఆదర్శ ప్రాయంగా తీర్చిదిద్దుతా'నని ప్రకటించిన ప్రభుత్వ విప్ బాల్కసుమన్ తన మాటను నిలుపుకుంటారా..? మునుపెన్నడూ లేనివిధంగా నిధులు విడుదల అయినప్పటికీ.. అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోవటం ఇక్కడి ప్రజల్లో అసంతృప్తికి గురిచేస్తోంది. నియోజకవర్గం వ్యాప్తంగానే కాకుండా మున్సిపాలిటీలకు సైతం ఆశించిన స్థాయిలో నిధులు మంజూరయ్యాయి. కాని పనుల కొనసాగింపే బాగాలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఆశించిన విధంగా నిధులు మంజూరయ్యాయి. రూ.100 కోట్లకు పైగానే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇటీవల మున్సిపాలిటీలకు మరో రూ.25 కోట్లు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ జీవో జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే అభివృద్ధి పనులు ప్రారంభం కూడా అయ్యాయి. కొన్ని ఊపందుకున్నాయి. ముఖ్యంగా పట్టణాన్ని పీడిస్తున్న కరెంటు సమస్య ఎట్టకేలకు తొలగిపోయింది. అదే విధంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు కూడా ఆశించిన రీతిలోనే సాగుతున్నాయి.

క్యాతనపల్లికి తాజాగా రూ.25 కోట్లు


అసంపూర్తిగా క్యాతనపల్లి ఫ్లైఓవర్ నిర్మాణం

క్యాతనపల్లి మున్సిపాలిటీకి తాజాగా రూ.25 కోట్లు మంజూరయ్యాయి. దాదాపు ఈ నాలుగున్నరేళ్లలో రూ.100 కోట్లకు పైగానే విలువైన అభివృద్ధి పనులు పట్టణానికి మంజూరు కావటం విశేషం. కాకపోతే రెండేళ్ల పాటు కరోనా మహమ్మారి పట్టిపీడించడంతో అభివృద్ధి పనులు కొంత కుంటుపడ్డాయి. కరోనా తగ్గుముఖం పట్టిన అనంతరమైనా శిలాఫలకాల పనులు వేగిరం పుంజుకుంటాయని భావిస్తే నత్తనడకన సాగడంతో కొంత ప్రజల్ని నిరాశకు గురిచేసింది.

రోడ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తి...

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్ల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం. గద్దెరాగిడి శ్రీనివాసగార్డెన్స్ నుంచి క్యాతనపల్లి కమాన్ వరకు రోడ్ వైడెనింగ్, సెంట్రల్ లైటింగ్ కోసం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.22 కోట్లు మంజూరయ్యాయి. వీటితో పాటు క్యాతనపల్లి కమాన్ నుంచి రాజీవ్‌చౌక్, ఏరియా ఆస్పత్రి, రామాలయం, సూపర్‌బజార్ వరకు రోడ్ల నిర్మాణానికి అలాగే కొన్నిచోట్ల డ్రైనేజీల నిర్మాణానికి సుమారు రూ.15 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరయ్యాయి. ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఎమ్మెల్యే హామీ మేరకు పట్టణంలో ప్రధాన కూడళ్లుగా ఉన్న రాజీవ్‌చౌక్, జయశంకర్ చౌరస్తా, సూపర్‌బజార్ సెంటర్, రామాలయం చౌరస్తా తదితర జంక్షన్ల అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. అంబేద్కర్ అర్బన్ పార్కుకు శంకుస్థాపన చేసినా భూసేకరణ పూర్తి చేయాల్సి ఉంది. రోడ్‌వైడింగ్, డ్రైయినేజీల నిర్మాణం తదితర పనులు ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు రైల్వే ఓవర్‌బ్రిడ్జి సమస్య ప్రధానంగా పట్టిపీడిస్తోంది. దీనిని త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. పనులు పూర్తికాకపోవడంతో నాయకుల్లో సైతం కొంత అసంతృప్తి నెలకొంది.

ఎన్నికల్లో కొంత ఎదురుదెబ్బ తప్పదా..?

అభివృద్ధి పనుల ప్రగతి తీరుపట్ల పలువురు అసహనానికి గురవుతున్నారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ మధ్య కాలంలో ఆవేదన చెందుతున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా అందుబాటులో నిధులు ఉన్నందున పనులు త్వరగా పూర్తి అయ్యేందుకు విప్ బాల్కసుమన్ శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్ని పరిగణలోకి తీసుకోకుంటే ప్రజలే కాకుండా బీఆర్ఎస్ వర్గాలు కొందరు పార్టీ వీడే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా ఈ అభివృద్ధి పనుల అంశం కొంత మేరకైనా ప్రభావితం చేస్తుందనే ఆందోళన.. క్యాడర్‌ను వెంటాడుతోంది.

గతంలో ఎన్నడూలేనన్ని నిధులు తెచ్చాం



చెన్నూర్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూలేనన్ని నిధులు తీసుకువచ్చాం. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కొన్ని సాంకేతిక కారణాలతో పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా ఆర్వోబీకి సంబంధించి రైల్వేగేటుకు అటుఇటుగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫ్లైఓవర్ పూర్తిచేసేందుకు గడ్డర్స్ పెట్టి ఫ్లెయాష్ నింపాల్సి ఉంది. అయితే వర్షాలతో కొంత ఆలస్యమవుతోంది. అతి త్వరలోనే ఆర్వోబీ పూర్తిచేస్తాం. అలాగే శ్రీనివాసగార్డెన్స్ నుండి క్యాతనపల్లి కమాన్ వరకు రోడ్ వైడెనింగ్, సెంట్రల్ లైటింగ్ కోసం రూ.22 కోట్లతో టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఆర్‌కేపీలో అంతర్గత రోడ్లకు సైతం టెండర్ పూర్తయింది. పనులు త్వరలోనే ప్రారంభించి పూర్తిచేస్తాం.

– బాల్కసుమన్, ప్రభుత్వ విప్

రక్షణ సూత్రాలు పాటించాలి


గనిపై మాట్లాడుతున్న కేహెచ్‌ఎన్ గుప్తా

నస్పూర్: ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ రక్షణ సూత్రాలు పాటించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా తెలిపారు. శుక్రవారం ఎస్ఆర్‌పీ 3, 3ఏ గనిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూగర్భ, ఉపరితల గనుల్లో జరిగే ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు వివరించారు. ప్రతి ఉద్యోగి వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. సింగరేణిని జీరో హార్మ్ సింగరేణిగా మార్చుకోవడానికి యూనియన్ నాయకులు, ఉద్యోగులు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని తెలిపారు. ప్రమాదాల నివారణ, సంరక్షణ బాధ్యతలపై గని కార్మికుడు పెట్టం శ్రీనివాస్ ఆలపించిన గేయాలు ఉద్యోగులను ఆలోచింపచేశాయి. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ గోపాల్ సింగ్, గని మేనేజర్ సంతోష్, పిట్ సెక్రటరీ సాదుల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానిస్తున్న వాసవిక్లబ్ సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల వాసవి వారోత్సవాల్లో భాగంగా మంచిర్యాల వాసవి క్లబ్, వనితా క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్, విజయం టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 40మంది ఉత్తమ ఉపాధ్యాయులను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ వారు నిర్వహిస్తున్న అనాథ, వృద్ధాశ్రమంలోని వృద్ధులు, పిల్లలకు పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అక్కెనపల్లి రవీందర్, గౌరిశెట్టి ధనలక్ష్మీ, సరిత, నార్ల సరిత, మోటూరి అర్పిత, అయిత శ్రీనివాస్, చిటుమల్ల శ్రీనివాస్, మోటూరి సరిత, రేణికుంట్ల స్వప్న, కాచం సతీశ్, కేశెట్టి వంశీకృష్ణ పాల్గొన్నారు.

హోంగార్డుల సేవకు దక్కని గౌరవం

- విధుల బహిష్కరణకు తీర్మానం
- రెగ్యులర్ చేయాలని డిమాండ్


హోంగార్డులు

మంచిర్యాలక్రైం: శాంతిభద్రత పరిరక్షణలో సివిల్ పోలీసులతో సమానంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న హోంగార్డులకు సరైన గౌరవం దక్కడం లేదు. ఎక్కడ ధర్నాలు, రాస్తారోకోలు జరిగినా శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసు కానిస్టేబుళ్లతో సమానంగా విధులు నిర్వర్తిస్తారు. గతంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత హోంగార్డులకు ఉద్యోగ భద్రతతోపాటు రెగ్యులరైజ్, సమాన హోదా కల్పిస్తామని సీఎం కేసీఆర్ 2017లో అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడంతో ఆనందం వెల్లివిరిసింది. కానీ ఆ హామీ నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 5న హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు రవీందర్ రెండు నెలలుగా జీతం రాలేదని హోంగార్డు కమాండెంట్ కార్యాలయానికి వెళ్లగా అక్కడి సిబ్బంది అవమానించరంటూ ఆత్మహత్యాయత్నం చేయగా.. చికిత్స పొందుతూ చనిపోవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం జేఏసీ చైర్మన్ నారాయణ ఆధ్వర్యంలో ఈ నెల 16వరకు విధుల బహిష్కరణకు తీర్మానం ప్రకటించారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని 50శాతం మంది హోంగార్డులు ఈ నెల 6, 7న విధులు బహిష్కరించారు. కాగా, కొందరు ఉన్నతాధికారులకు భయపడి యథావిధిగా విధులు నిర్వర్తించారు. హోంగార్డులు తమ బాధలు, ఉన్నతాధికారుల వేధింపులు, విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు చెప్పుకునేందుకు సైతం ముందుకు రాకపోవడం గమనార్హం.

ఇదీ నేపథ్యం..

1962లో అప్పటి ప్రధాని నెహ్రూ పాలనలో కొందరు కలిసి ఒక స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛందంగా సేవలు చేసేవారు. కొన్ని రోజుల తర్వాత వారిని హోంగార్డులుగా పిలిచారు. అప్పట్లో పని చేసిన దానికి మాత్రమే వారికి కూలి ఇచ్చేవారు. తర్వాత వివిధ రాష్ట్రాలకు ఈ సంస్థ సేవలు విస్తరించాయి. ఈ క్రమంలోనే ఉమ్మడి రాష్ట్రంలో హోంగార్డు విభాగం 1963 డిసెంబర్ 6న ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి రాష్ట్రంలో పోలీస్ శాఖలో వేలాది మందిని హోంగార్డులుగా నియమించి 1993 డిసెంబర్ 6న పోలీస్‌శాఖలో హోంగార్డు వ్యవస్థను స్థాపించారు. ప్రతియేటా డిసెంబర్ 6న హోంగార్డు దినోత్సవం నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 919 మంది హోంగార్డులు ఉండగా.. వీరిలో 120మంది మహిళా హోంగార్డులు ఉన్నారు.

సౌకర్యాలు అంతంతే..

విధి నిర్వహణలో చాలామంది హోంగార్డులు అనారోగ్యం బారిన పడుతున్నారు. దుమ్ము, ధూళిలో పని చేస్తూ శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. హెల్త్‌కార్డులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నేటికీ ఆరోగ్య భద్రత లేకుండా పోయింది. ఇతర జిల్లాలో బందోబస్తుకు వెళ్తే టీఏ, డీఏ, ఇతర అలవెన్స్ ఇవ్వడం లేదు. ఏడాదికి నాలుగు జతల దుస్తులు ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతం అవీ అందడం లేదు.

వివిధ శాఖల్లో సేవలు..

హోంగార్డులు ఆర్టీసీ, ఫైర్, ఎఫ్‌సీఐ, ఓఎన్‌జీసీ, రైల్వే, సబ్‌జైల్, దేవస్థానాల్లో సేవలు అందిస్తున్నారు. ఏ శాఖలో పని చేసినా బందోబస్తుకు వెళ్లినప్పుడు రవాణా, భోజన చార్జీలు చెల్లించడం లేదు. సొంత ఖర్చులతోనే వెళ్తుండగా.. పోలీస్ సిబ్బందికి టీఏ, డీఏ చెల్లిస్తారు. సాధారణ పోలీసులతో సమానంగా పని చేస్తున్న వీరికి వేతనాల విషయంలో చాలా వ్యత్యాసం ఉంది. హోంగార్డులు మృతిచెందితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక నిధి ఏమీ లేదు. సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రతీ హోంగార్డు వేతనం నుంచి నెలకు రూ.20 వసూలు చేసి అందులో నుంచి రూ.10 కేంద్రనిధికి, మిగతా రూ.10 హోంగార్డుల సంక్షేమ నిధికి జమ చేస్తున్నారు. సహజ మరణానికి రూ.15వేలు, ప్రమాదవశాత్తు మరణానికి రూ.20వేలు అందజేస్తారు. ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న వారికి 30శాతం అదనపు అలవెన్స్ అందిస్తున్నారు.

కార్మికులకు ఒకే దఫాలో ఏరియర్స్ చెల్లించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన ఏరియర్స్‌ను ఒకే దఫాలో సింగరేణి కార్మికులకు చెల్లించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి డిమాండ్ చేశారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలని, ఏరియర్స్‌ను ఒకే దఫాలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ వేజ్‌బోర్డుకు సంబంధించి 23 నెలల ఏరియర్స్‌ను కార్మికులకు రెండు దఫాల్లో కాకుండా ఒకే దఫాల్లో చెల్లించాలని అన్నారు. అదే తరహాలో సింగరేణి సంస్థ గత సంవత్సరం ఆర్జించిన లాభాల్లో నుంచి కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలని, అలవెన్స్‌లపై ఐటీని సింగరేణి యాజమాన్యమే భరించాలన్నారు. సింగరేణి గుర్తింపు సంఘం వైఫల్యం కారణంగానే కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదని ఆరోపించారు. నాయకులు బయ్యా మొగిళి, మారం శ్రీనివాస్, రాజేష్, దివాకర్, కిరణ్, చంద్రశేఖర్, శేషు, అంజన్న, షకీల్, రాంకిషన్, శ్రీనివాస్, శంకర్, దేవయ్య, జంగు, భీమయ్య కూర్చున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రవీందర్, సీపీఐ నాయకులు రవికుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి, మండల కార్యదర్శి బాలునాయక్ ఉన్నారు.

ఐఎన్‌టీయూసీ నిరసన

నస్పూర్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్‌ని ఒకే దఫాలో చెల్లించాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఆర్‌కే 7 న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులకు స్వంత ఇంటి నిర్మాణానికి 250 గజాల స్థలాన్ని ఉచితంగా ఇవ్వాలని అన్నారు. కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కలవేణ శ్యాం, నాయకులు గరిగె స్వామి, సమ్మ రాజయ్య, జాన్సన్ ఉన్నారు.

కైరిగూడ ఓసీపీని సందర్శించిన డీడీఎంఎస్ ఇన్‌స్పెక్టర్


పరిశీలిస్తున్న డీడీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌వర్మ

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీని శుక్రవారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ ఓం ప్రకాష్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఓసీపీలోని పలు ఎలక్ట్రికల్ విభాగాలను పరిశీలించారు. ఓసీపీలో వినియోగిస్తున్న పంపులతో పాటు సీహెచ్‌పీ, సబ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్షణతో కూడిన ఉత్పత్తిని చేపట్టాలని సూచించారు. ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేసే ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా రక్షణ సూత్రాలను పాటిస్తూ రక్షణ పరికరాలను విధిగా ఉపయోగించాలని, అందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించిన రక్షణ పద్ధతులపై పూర్తిస్థాయిలో ఉద్యోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, ఏరియా ఇంజినీరు తిరుమల్‌రావు, ఏరియా రక్షణాధికారి ఇంధా, డీజీఎం ఈఅండ్ఎం రాంనాథం, ఓసీపీ మేనేజర్ ప్రవీన్ ఫాటింగ్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, ఇంజనీర్లు నరేష్, గౌసొద్దీన్, శంకర్, సర్వే అధికారి రామాచారి పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో 'హస్త'వ్యస్తం!

- విభేదాలతో పోటాపోటీ కార్యక్రమాలు
- కార్యకర్తల్లో అయోమయం



బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. రెండు వర్గాల విభేదాలతో కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్ రావు, రాష్ట్ర మాజీ మంత్రి గడ్డం వినోద్ వర్గాలు పోటాపోటీగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నా ఐక్యత కరువై ఏఐసీసీ, టీపీసీసీ పిలుపునిచ్చే కార్యక్రమాలు వేర్వేరుగా నిర్వహిస్తూ బలాన్ని ప్రదర్శిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్వహించిన జోడోయాత్ర ఏడాది కాలం పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం పాదయాత్ర, ర్యాలీలకు టీపీసీసీ పిలుపునిచ్చింది. దీంతో పార్టీ శ్రేణులు రెండు వర్గాలుగా నువ్వా నేనా అనే విధంగా పాదయాత్ర చేశారు. చివరికి రెండు వర్గాలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నాయి. ఓ వర్గం నాయకుడిని ఉద్దేశించి చేసిన నినాదాలు రెండు వర్గాల మధ్య అగ్గి రాజేశాయి. ఏ కార్యక్రమం నిర్వహించిన ఓ వర్గం కవ్వింపు చర్యలకు పాల్పడడం సర్వసాధారణమైంది. నాలుగు నెలల క్రితం ఓ వర్గంపై మరో వర్గం శ్రేణులు దాడికి పాల్పడి ముష్టిఘాతాలకు దిగడం తెలిసిందే.

టికెట్ కోసం ఆశావహుల పోటీ

బెల్లంపల్లి ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి పోటీకి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎనిమిది నాయకులు టికెట్ ఆశిస్తున్నారు. రాష్ట్ర మాజీ మంత్రి గడ్డం వినోద్, నాయకులు చిలుముల శంకర్, నాతరి స్వామి, కాంపల్లి ఉదయ్‌కాంత్, రొడ్డ శారద, ముడిమడుగుల మహేందర్, చొప్పదండి దుర్గాభవానీ, దాసరి విజయ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఓ వైపు ఆశావహుల దరఖాస్తుల పరిశీలన సాగుతుండగా క్షేత్రస్థాయిలో ఆయా వర్గాలు పోటాపోటీగా వ్యవహరిస్తుండడం చర్చనీయాంశమైంది. ప్రత్యర్థి వర్గానికి టికెట్ కేటాయిస్తే ఓడిస్తామని మరో వర్గం శ్రేణులు బాహాటంగానే చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి ఆసిఫాబాద్, ప్రస్తుత బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో దాదాపు పాతికేళ్లపాటు కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం లేకుండా పోయింది. రెండు వర్గాల్లో ఏ వర్గానికి టికెట్ వచ్చినా అనివార్యంగా మరో వర్గం మద్దతు ఇస్తే కానీ గెలుపు సాధ్యం కాదు. టీపీసీసీ అధిష్ఠానం క్షేత్రస్థాయిలో విభేదాలను రూపుమాపడానికి ప్రత్యేక దృష్టి సారించాలని శ్రేణులు కోరుతున్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్‌పీ 1, 3, 3ఏ గనిలో గైర్హాజరు కార్మికులకు శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో జీఎం సంజీవరెడ్డి ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ 2022-23లో గైర్హాజరైన కార్మికులు ఇకపై ప్రతీ నెల తప్పకుండా 20 మస్టర్లు చేయాలని అన్నారు. 72 మంది ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి, ఎస్ఓటూ జీఎం కె.రఘుకుమార్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, అధికారులు రాజేశ్వర్‌రావు, రాజేశ్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడి


స్థావరాల పై దాడులు చేసిన పోలీసులు

దహెగాం: మండలంలోని మర్రిపల్లి, దేవులగూడ గ్రామాల్లో శుక్రవారం గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్‌శాఖ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో మర్రిపల్లి గ్రామంలో 30 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. దేవులగూడలో 10లీటర్ల గుండుబా స్వాధీనం చేసుకోవడంతో పాటు 200లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశా రు. మర్రిపల్లి గ్రామానికి చెందిన ఆరుగురితో పా టు దేవులగూడలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ, ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

నేడు నిరాహార దీక్ష

నస్పూర్: మైనింగ్ అండ్ టెక్నికల్ స్టాఫ్ సబ్ కమిటీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూని యన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో పలు స మస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట శనివారం నిర్వహించే నిరాహార దీక్షను విజయవంతం చేయాల ని ఏఐటీయూసీ నాయకులు వంగరి రాజేశ్వర్‌రావు, గోపతి సత్యనారాయణ, రాజేశ్ యా దవ్, శ్రీహరి, జాదవ్, సాంబయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సర్టిఫికెట్లు అందజేత


సర్టిఫికెట్లు అందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: సింగరేణి సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నస్పూర్ కాలనీలోని సేవా భవన్‌లో నిర్వహించిన వృత్తి శిక్షణ కోర్సులకు నిర్వహించిన రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన 252 మంది మహిళా అభ్యర్థులకు జీఎం సంజీవరెడ్డి ఖాదీ గ్రామోద్యోగ్ వారి సర్టిఫికెట్లు అందించారు. సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కె.సురేందర్ రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, సింగరేణి సేవా సమితి కో-ఆర్డినేటర్ శివకుమార్ ఉన్నారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు బహుమతుల ప్రదానం


లక్ష్మికి చెక్కు అందజేస్తున్న సజ్జనార్


చెక్కు అందుకుంటున్న కే.ప్రాంజల్


బహుమతి అందుకుంటున్న రాజశ్రీ

రాఖీ పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు నిర్వహించిన లక్కీడ్రా విజేతలకు హైదరాబాద్‌లో శుక్రవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ బహుమతి ప్రదానం చేశారు. మొదటి బహుమతి భైంసాకు చెందిన ఎస్.లక్ష్మికి రూ.25వేలు, ద్వితీయ బహుమతి ఆదిలాబాద్‌కు చెందిన విద్యార్థిని కే.ప్రాంజల్‌కు రూ.15వేలు, తృతీయ బహుమతి డి.రాజశ్రీకి రూ.10వేలు విలువైన చెక్కులను అందజేశారు.